# కుడియెడమల దగాదగా

సునీతకి ఆరో పెళ్ళిచూపులు ఆరోజు! ఆ పిల్ల కాస్త నోరు మూసుకుంటే బాగుండు. ఈ సంబంధమైనా కుదురుతుంది. అని కన్నతల్లి ఆరాటం! చదువుకుని, ఉద్యోగం చేస్తూ, ఐదువేలు సంపాదించుకుంటున్న కూతురు అభిప్రాయాలతో తండ్రిగా ఏకీభవించినా లోకంపోకడకి వ్యతిరేకంగా కూతుర్ని అర్థం చేసుకునే వరుడు, వరుడి తరుపువారు ఇప్పటివరకు తటస్థపడనందుకు, కూతురి వయసు మీరిపోతూందని లోలోపల బెంగపడే తండ్రి ఆరాటం! నాకెవరి అభిప్రాయాలతో పనిలేదు. నా అభిప్రాయం నాది. నాకు వ్యక్తిత్వం ఉంది. నా అభిప్రాయాలు నచ్చిననాడే చేసుకుంటాడు. లేదంటే పెళ్లికాకపోతే, ఆలస్యం అయితే కొంపేం మునిగిపోదని సునీత భరోసా!

పెళ్లివారు వచ్చారు, చూశారు. సునీత కుండబద్దలుకొట్టినట్టు అన్నమాటలు విన్నారు. మొహాలు చూసుకున్నారు. 'వెళ్లివస్తాం' అంటూ జారుకున్నారు. 'నీకీ జన్మకు పెళ్లికాదు. నీ పద్ధతి మార్చుకోకపోతే...!!'' కూతురి మీద అంతెత్తు ఎగిరింది సావిత్రి పెళ్లివారు ముఖాలు మాడ్చుకు వెళ్లగానే.

"నా పద్ధతి ఏం మార్చుకోవాలంటావు?'' సునీత తల్లి మీద అంతకంటె ఎగిరింది.

"అదే పొగరుమోత్తనం తగ్గించుకోకపోతే ఏ తలమాసినవాడుకూడా చేసుకోడు. ఆడపిల్లని కాస్త నమ్రత అలవర్చుకోకపోతే 'చూపులనాడే ఇలా మాట్లాడింది. రేపు కాపురం ఏం చేస్తుంది?' అన్న సందేహం వస్తుంది. ఎవరికన్నా నీ ధోరణి చూస్తే, పిల్లాడి సంగతి నీవు చూసుకో, మిగతావి మేం చూసుకుంటాం. అంటే పెద్ద ఆదర్శవాదిలా ఈవిడగారికే లోకంలో ఎక్కడా లేని ఆదర్శాలున్నట్టు మహా తనే ఉద్యోగం చేసి సంపాదిస్తున్నానన్న పొగరుతో...ఆడదానికింత పొగరు వుండకూడదే!'' సావిత్రి గొంతు కోపంతో వణికింది.

"ఓహో మగాడికే పొగరుండవచ్చుననన్నమాట! చదువుకున్న నీవు ఇలా మాట్లాడబట్టే ఎన్నాళ్లయినా మనం ఇలాగే ఉన్నాం. ఇంతకీ నేనేం తప్పుమాటన్నానో వివరిస్తారా...'' వ్యంగ్యంగా అంది.

"లోకంలో నీవొకర్తివే పెళ్లాడుతున్నావా? అచ్చట... ముచ్చట... సంప్రదాయరీతిలో వాళ్ల కొడుకు పెళ్లి జరగాలని వాళ్లనుకుంటే అది తప్పా? నీకంటే సరదా చట్టుబండలు

లేవు. అవతలివారికి ఉండకూడదంటే ఎలా?" తీక్షణంగా అంది.

"అమ్మా, పెద్ద ఆదర్శవాదుల్లా పోజు పెట్టి "అబ్బే మాకేం కట్నాలు అక్కరలేదు. పెళ్లి బాగా చేయండి' అంటూ మొదలు పెడతారు. కట్నాలు లేకపోయినా కాస్త అచ్చటా ముచ్చటా ఉండాలిగా.. కాస్తయినా ఇచ్చిపుచ్చుకోడాలు తప్పవు గదా అని ఓ వెకిలినవ్వు పారేస్తారు. అప్పగింత బట్టలన్నా ఉండాలిగా... అంటూ ఇంటిల్లిపాదికి బట్టల లిస్టు. అబ్బాయికి సూటు, ఉంగరం తప్పదు కదా.... ఒక్కతే ఆడబడుచు, మళ్ళీ మళ్ళీ అన్న పెళ్ళిముచ్చట ఉంటుందా, వెయ్యిన్నూటపదార్లు, వెండి బొట్టు పెట్టె అత్తగారికి, ఆడబడుచుకి ఇవ్వండి. అని దీర్ఘాలు. ఇద్దరం ఇక్కడే ఉన్నాంగా రెండుసార్లు డిన్నర్లు ఎందుకు? ఇద్దరం కలిపే ఇద్దాం అంటూ ఉదారంగా మాట్లాడేసి సగం మనచేత ఖర్చుపెట్టించి వాళ్ల వాళ్లు ఓ ఐదువందలమంది వస్తారు అంటారు. కాస్త మంచి హాలు బుక్ చెయ్యండి. బాత్‌రూమ్‌లు బాగుండాలి. అమ్మాయి అల్లుడు అమెరికా నించి వస్తారు. ఈ నీళ్లు అవీ తాగరు. మినరల్ వాటర్ ఉండాలి. పెద్దపెద్దవాళ్లు వస్తారు. మెను బాగుండాలి. కట్నం వద్దన్నవాళ్లు ఇచ్చే పెద్దలిస్టు ఇది. అంతా కలిసి రెండు లక్షలవుతుంది..."

"చూడు సునీతా, ఇదంతా ప్రతి ఆడపిల్ల తల్లిదండ్రులు చేస్తున్నదే కదా. మనం ఒక్కరమే కాదు కదా!" తల్లి కూతుళ్ల వాదన విన్న చలపతిరావు అందుకున్నాడు మధ్యలో.

"అదే నాన్నా నేనంటున్నది.... కట్నం లేదంటూ ఈ లక్షల ఖర్చేమిటి? రోజురోజుకీ ఖర్చు తగ్గడం అటుంచి కాంపిటీషన్లు మాదిరి డెకరేషన్లు, లైట్లు ఇవి అవి అంటూ మరింత పెరిగిపోతోంది. పెళ్లి సింపుల్‌గా చేసుకుందాం అంటే నేనేదో నేరం చేసినట్లు చూస్తారేమిటి? రిజిస్టరు పెళ్లి చేసుకుని అంతగా కావాలంటే గుళ్లో పుస్తెకట్టించుకుని, దగ్గర వాళ్లకి పార్టీ ఇచ్చుకుందాం అన్న నా పాయింటుని అర్థంచేసుకోకుండా నన్ను తప్పుపడతారేమిటి?" తీక్షణంగా అంది.

"అఁ... మా అమ్మాయిని మీ ఇంటికి కట్టుబట్టలతో పంపిస్తాం, తీసికెళ్లండి...అంటే మహాభాగ్యం అనుకుని ఈ మాత్రం పిల్ల దొరకదన్నట్టు తీసికెళ్లే విశాలహృదయులు ఈ తరంలో ఉండరులే! నీ పిల్లలకి అలా చేద్దువుగాని" సావిత్రి వ్యంగ్యంగా అంది.

"మన ఆలోచనల ధోరణి మార్చుకుంటే ఈ తరంలోనే చేసి చూపించవచ్చు. నేనేం కట్టుబట్టలతో వెళ్లడంలేదు. ఐదువేలరూపాయల ఉద్యోగంతో వెడ్తున్నాను. అతనితో సమానంగా ఉద్యోగం చేస్తున్నాను. ఇంకా మీరు నా కోసం లక్షలక్షన్నరా ఎందుకు ఖర్చుపెట్టాలి?" రెట్టించింది.

"సునీతా ఐ అగ్రీ విత్ యూ.. కాని ఇప్పటికి ఆరుగురు వచ్చి చూశారు. నీ

మాటలకి ఎవరన్నా అంగీకరించారా? ఆ అబ్బాయిలూ చదువుకున్న వారే! నీ మాటల్లో మంచిని గ్రహించి వాళ్లవాళ్లని ఒప్పించి ముందుకు వచ్చారా?"

"అదే నాన్నా నేను అనేది. ఈ కాలం అబ్బాయిలకు పెళ్లివేళకి వచ్చేసరికి అమ్మ, నాన్న సంప్రదాయాలు కావాలి. వేడుకలు కావాలి. కనీసం చదువు, ఉద్యోగం, ఉన్న అమ్మాయిలన్నా ఈ సంప్రదాయాల పేరిట ఈ దోపిడీని అరికట్టాలని నా ఉద్దేశ్యం. అంతగా మీకందరికీ డబ్బు ఎక్కువైతే ఇటు వాళ్లు ఒకలక్ష, అటువాళ్ళు ఒకలక్ష, ఇచ్చి కొత్త కాపురం వాళ్లకి సామాను కొనుక్కోడానికి సాయం చేయండి అనడం తప్పా. ఇంతకీ ఈ సంప్రదాయం పెళ్ళిళ్లు ఎంత బాగా జరుగుతున్నాయో చూస్తున్నాం కదా! చచ్చిచెడీ అన్ని ఏర్పాట్లు చేసి షామియానాలు, లైట్లు, భోజనాలు, డెకరేషన్లకి వేలకివేలు ఖర్చుపెడితే పెళ్లికి వచ్చిన వాళ్లు జీలకర్ర బెల్లం నెత్తిన పెట్టగానే పోలోమని లేచివచ్చి వధూవరుల నెత్తిన ఇన్ని అక్షింతలు జల్లి, తెచ్చిన బహుమతి చేతిలో పడేసి, తోసుకుంటూ భోజనాలకి వెళ్లి తినేసి పోతున్నారు. కనీసం మంగళసూత్రం కట్టేవరకన్నా ఉండకుండా బంధువులు సయితం జరుకుంటారు. మన హడావిడి చూసి పురోహితుడు ముచ్చటగా ముప్పై నిమిషాల్లో అన్ని తంతులు జరిపేసి, ఏదీ వదలకుండా అన్నీ మూటకట్టుకుని జారుకుంటాడు. చచ్చిచెడి చేసిన ఏర్పాట్లు, లక్షల ఖర్చు అన్నీ రెండు గంటలలో ముగుస్తాయి. ఇలా సంప్రదాయాన్ని పూర్తిగా పాటించక, అటు అన్నీకాదని సింపుల్‌గా రిజిష్టరు మారేజీ చేసుకోలేక ఈ తరం నలుగుతోంది. ఎవరో కొంత ముందయినా ఇలాంటి వాటికి మంగళం పాడాలని చూస్తే తప్పు పడ్తారేమిటి?"

"నీవు చెప్పింది అంతా నిజమేనమ్మా, కాని అర్థం చేసుకునేవారెవరు? ప్రతివాళ్ళు మొహాలు చూసుకుని ఈపాటి సంబంధం మనకింద దొరకదా! అని లేచిపోతున్నారు. పోనీ ఆ చెప్పేది ఏదో పిల్ల నచ్చిందన్నాక నెమ్మదిగా నచ్చజెప్పవచ్చుకదా!"

"ముందే చెప్పాలమ్మా! ఇష్టం అయినవారు చేసుకుంటారు లేదంటే మానతారు. పిల్ల నచ్చిందన్నాక ఇంకా ఆశాభంగం..."

"నీ ఖర్మ... నీకింక పెళ్లికాదు. ఇరవై ఏడు నిండాయి. ఇంకో రెండేళ్లు నిండితే అప్పుడింక పెళ్లి అక్కరలేదులే! ఇంక సంబంధాలు చూడడం మా వల్లకాదు తల్లీ...చేసుకుంటావో మనుకుంటావో నీ ఇష్టం" సావిత్రి నిస్పృహగా అంది.

"నేనేం మిమ్మల్ని చూడమన్నానా? మీరు చూస్తుంటే సరే అనుకున్నాను. ఇకముందు మీరు ఎవరిని పిలవవద్దు. నాకెవరన్నా నచ్చితే, నా అభిప్రాయం నచ్చి ముందుకువస్తే నేనే చెబుతాను" సునీత ఖచ్చితంగా అని గదిలోంచి వెళ్ళిపోయింది.

"ఈకాలం ఆడపిల్లలు ఉద్యోగాలు చూసుకుని మరీ పేట్రేగిపోతున్నారు" సావిత్రి కోసం.

"అవును సావిత్రీ, పెళ్లికాకపోయినా ఫరవాలేదన్న ఆత్మవిశ్వాసం వాళ్లకి ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఇప్పుడు చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ వాళ్లకీ ఓ వ్యక్తిత్వం ఉందని నిరూపించుకోవాలనుకుంటున్నారు. ఇదీ మంచి మార్పుకి నాంది అనుకుని మనం సంతోషించాలి.

"తండ్రీ కూతుళ్లు సంతోషిస్తూ కూర్చోండి...." సావిత్రి కోపంగా చూసి వెళ్ళిపోయింది. చలపతి రావు భార్య బాధ అర్థం చేసుకున్నట్టు నవ్వాడు.

* * *

"హలో... ఎక్స్క్యూజ్‌మీ..." పిలుపువిని ఆఫీసు కాగితాలలోంచి తలెత్తిన సునీత ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటలా చూస్తున్నారు? గుర్తుపట్టలేదా నన్ను రామకృష్ణని ... అదే నెల క్రితం పెళ్లిచూపులకొచ్చాను. అప్పుడే మర్చిపోయారా?" నవ్వుతూ అన్నాడు.

"ఆ గుర్తులేకేం.... కాని ఇలా ఇక్కడ మిమ్మల్ని చూడటం..."

"మీతో కాస్త మాట్లాడాలని వచ్చాను. కాని, ఇఫ్‌యూ డోంట్‌మైండ్, ఓ అర్థగంట నా కోసం స్పేర్ చేయగలరా?"

"అంత అర్జంటా? లంచ్ అవర్‌లో..."

"నేను ఆఫీసుపని మీద వచ్చాను. ఒంటిగంటకి నాకు మీటింగ్ ఉంది. ఓ అరగంట పర్మిషన్ తీసుకుని వస్తే."

"సరే పదండి... "పక్కసీటు పద్మకి చెప్పి రిసెప్షన్ రూము వైపు నడిచింది సునీత.

"ఊఁచెప్పండి" అంది కూర్చున్నాక.

"ఏం లేదు..పెళ్లిచూపులలో మీరన్న మాటలు నాకు వచ్చాయి. మీ పాయింటు నాకు అర్థం అయింది. ఇంటికెళ్ళాక ఆలోచించుకుంటే మీరన్నట్టు ఈ ఖర్చులు అన్నీ దండగ. మనలాంటివాళ్లం ఈ దండగ ఖర్చులకి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న మీ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. మావాళ్ళతో వాదించి ఒప్పించాను. నా వైపునంచి లైన్‌క్లియర్..అది చెప్పాలని వచ్చాను... ఇంక మీకేం అభ్యంతరం లేదుగా..." ఆదుర్దాగా అడిగాడు రామకృష్ణ.

సునీత మొహం వికసించింది. తనని అర్థం చేసుకున్న మగవాడు ఒకడైనా

కనిపించడాన్ని సంతృప్తి కనిపించింది.

"రియల్లీ! మీరు మనస్ఫూర్తిగా నా అభిప్రాయాలతో ఏకీభవించారనుకుంటారు... నో రిగ్రెట్స్"

"సెంట్‌పర్సంట్ ఏకీభవించాను కనుకే వచ్చాను మీ దగ్గరకి.."

"అయితే నాకేం ఇంక అభ్యంతరం లేదు. మీరు ఒకమాట మావాళ్ళతో కూడా చెప్పండి"

"ముందు మీ ఇంటికి వెళ్లే వస్తున్నాను ఇటు. మీ నాన్నగారితో మాట్లాడాను. మీతో మాట్లాడమంటే ఇలా వచ్చాను" రామకృష్ణ వివరించాడు.

"థాంక్స్" సునీత మనస్ఫూర్తిగా అంది.

* * *

సునీత రామకృష్ణల పెళ్లి ముందు రిజిస్ట్రార్ ఆఫీసులో అయ్యాక, దేముడు ముందు పుస్తె కట్టాడు రామకృష్ణ. సాయంత్రం అటు ఇటు దగ్గర బంధువులు సుమారు నూరు మందికి సునీత ఇంటి డాబా మీద పార్టీ ఇవ్వడంతో పెళ్లి ముగిసింది. వచ్చిన అందరూ ఆదర్శదంపతులని, వారి ఆశయాన్ని అభినందించి వెళ్లారు. ఆ సాయంత్రం నూతన దంపతులు కాపురం కోసం అద్దెకు తీసుకున్న ఫ్లాట్‌లోకి వెళ్లిపోయారు. గృహప్రవేశాలు, శోభనం తంతులు అన్నింటికీ స్వస్తిచెప్పి, తను అనుకున్నది సాధించానన్న తృప్తి, తనని అర్థం చేసుకున్న భర్త దొరికిన ఆనందంతో, కృతజ్ఞతతో మనసారా అతనికి తనని తాను అర్పించుకుంది.

అయితే సునీత తృప్తి, ఆనందం, గర్వం అంతా రెండు గంటలలోనే ఆవిరి అయిపోయినట్టనిపించింది. సునీత కళ్లముందే ఆమె కట్టుకున్న కలలసౌధం కూలిపోయినట్టనిపించింది. అతని చేతిలో తృప్తిగా వాలిన సునీత కళ్లముందు రామకృష్ణ జేబులోంచి చెక్కు తీసి ఆడించాడు. లక్షరూపాయల చెక్కు... కింద తండ్రి సంతకం... సంభ్రమాశ్చర్యాలతో చూసింది. రామకృష్ణ ఇచ్చిన వివరణ విని సునీత దిగ్భ్రాంతిగా చూసింది. తనన్న మాటలకు, తన భావానికి రామకృష్ణ వక్రీకరణకి దిమ్మెరపోయింది. "లక్షతో మన ఇంటికి కావలసిన సామానులన్నీ వస్తాయి."

సంబరంగా అంటున్న అతన్ని తిరస్కారంగా చూసింది. తనని అర్థంచేసుకోడం అంటే ఇదా? తనన్న మాటలకు అతనికి నచ్చిన పాయింటు ఇదా? అందుకే సింపుల్‌గా పెళ్లికి ఒప్పుకున్నాడా? పెళ్లిఖర్చులు, అత్తగారికి వాటా అన్నీ మానేస్తే లక్షా తనకే వస్తుందన్న ఆశతో ఒప్పుకున్నాడు. ఎంత మోసం! ఎంత దగా.. తన తల్లిదండ్రుల

ఆరాటాన్ని ఈ విధంగా కాష్ చేసుకున్నాడా తెలివిగా... తన దగ్గిర మాటవరసకన్నా ఇటు తల్లిదండ్రులు, అతను చెప్పకుండా దాస్తారా? ఇప్పుడు పెళ్లి అయిపోయింది. శోభనం కూడా జరిగిపోయింది. ఇంక చెప్పినా ఫరవాలేదనుకున్నాడా... చెబితే ఇంకేం చేస్తుందన్న ధైర్యమా... సునీత మనసు, శరీరం నిప్పులు రాసుకున్నట్టు మండింది.

భేష్ మగవాడా... భేష్...ఎంత ఆదర్శంతుడివి ఎంత చక్కగా అర్థం చేసుకున్నావు నా ఆశయాన్ని! లక్షకి కక్కుర్తిపడి, పైగా గర్వంగా లక్ష ఎంత ఈజీగా సంపాదించావో అన్న ఆనందంగా చెప్పడం.. ఎంత దిగజారుడుతనం... ఆ డబ్బుతో ఇంట్లో సామాను నింపుకోవచ్చన్న గొప్ప ఆలోచన ఎంత లేకితనం.. లక్షకోసం, పాపం, సంప్రదాయపు వివాహానికి తిలోదకాలు ఇచ్చిన త్యాగధనుడిని. అంతా తనకిందే ఖర్చు పెట్టుకోవాలి. కనిపెంచిన తల్లిదండ్రులకి కనీసం బట్టలకన్నా ఇవ్వక్కరలేదన్న గొప్ప స్వార్థం.. ఆమెకే శక్తి ఉంటే.. ఆమె చూపులకే శక్తి ఉంటే రామకృష్ణ అక్కడికక్కడే మాడిమసి అయ్యేవాడే.

ఆమె చూపులు తప్పించుకుంటూ "ఏమిటలా చూస్తున్నావు? నీవేగా అన్నావు? ఈ దండగ ఖర్చులు అన్నీ వద్దని.. నాకూ అదే మంచిదనిపించింది. మీ నాన్నగారు నీ పెళ్లికోసం దాచింది ఇచ్చేస్తాను అంటే సరేననుకున్నాను''. తనని తాను సమర్థించుకోబోయాడు.

"అంటే లక్ష ఇస్తారని రిజిస్టరు పెళ్లికి ఒప్పుకున్నారన్నమాట! ఆ లక్ష ఇవ్వకపోతే నన్ను చేసుకునే వారా?'' తీక్షణంగా చూసింది.

జవాబుకి రామకృష్ణ తడబడ్డాడు.

"మీరు ముందే నాన్నతో మాట్లాడి వచ్చి నా దగ్గిర ఇది దాచి, చాలా గొప్పగా నీతో ఏకీభవిస్తున్నానని అన్నారన్నమాట!''

రామకృష్ణ తడబడ్తూ ఏదో చెప్పబోయాడు. 'నేను సింపిల్‌మేరేజీ అంటే అటు అటు దండగ ఖర్చులు ఉండకూడదని...అంతేగాని ఇలా డబ్బు దండుకోమని కాదు.'

"మరి నీవే అన్నావుగా ఆ ఖర్చులన్నీ మాని అటువాళ్లు ఇటువాళ్లు ఆ డబ్బిస్తే కొత్తకాపురానికి పనికొస్తుందని...'' ధీమాగా తలెత్తి ఏం అంటావన్నట్టు చూశాడు.

"అది డబ్బు ఉన్నవారి గురించి... మాటవరసకి అన్న ఆ మాట మాత్రం మీకు నచ్చింది. ఆ పాయింట్ ఒక్కటే మీరు పట్టుకున్నారన్నమాట! చూడండి.. మా నాన్న రిటైరయ్యారు. ఇద్దరి పెళ్లిళ్లు చేశారు. ఆయన దగ్గిర ఏమాత్రం ఉందో నాకు తెలుసు. ఈ లక్ష ఫిక్సెడ్ డిపాజిట్ తీసేస్తే కేవలం ఆయన పెన్షను మీద ఆధారపడి అన్నింటికి ఇబ్బంది పడాలన్నది నాకు తెలుసు కనకే ఖర్చు లేకుండా ఆ పెళ్లి కావాలన్నాను.

అంతేగాని ఆ లక్షకోసం ఆత్మాభిమానం వదిలి మామగారిదగ్గర పుచ్చుకుని పైకి ఆదర్శవంతులుగా పోజుపెట్టమని కాదు" తీవ్రంగా అంది.

రామకృష్ణ మొహం ఎర్రబడింది. "అయితే ఆ మాట అనకుండా ఉండాల్సింది. మావాళ్లు దమ్మిడీ ఇవ్వరు అని ముందే చెప్పాల్సింది".

"అంటే ఆ లక్ష కోసం చేసుకున్నారన్నమాట! సరే! ఇటువాళ్లు అటువాళ్లు ఖర్చుపెట్టేది పెళ్లికొడుకు, పెళ్ళికూతురికి ఇచ్చేస్తే బాగుంటుందని అన్నాను. మా లక్ష మీరు తీసుకున్నారు. మరి మీ వాళ్ల లక్ష ఏది?"

రామకృష్ణ తెల్లబోయాడు. "మా వాళ్లెందుకు ఇస్తారు? మగపెళ్లివారు. వాళ్లకి రావల్సింది వాళ్లు వదుల్కున్నారు. అంతే చాలు"

"ఓహో మగపెళ్లివారేం ఖర్చు చెయ్యక్కరలేదన్నమాట! నాకు చీరలు, నగలు పెట్టాలి. పార్టీ ఇవ్వాలి. గృహప్రవేశం. మీవాళ్ళ బట్టలు అన్నీ కలిసి వాళ్లకీ లక్ష అవుతుంది. అది ఎందుకివ్వరు?" రెట్టించింది.

రామకృష్ణ ముఖం మాడిపోయింది. జవాబు లేనట్టు తలదించుకున్నాడు.

"ఆ లక్ష అయినా తెండి, లేదంటే ఈ లక్ష మావాళ్ళకి వెనక్కి ఇచ్చేయండి" ఖచ్చితంగా అంది. అతని ముఖం ఎర్రబడిపోయింది.

"ఇవ్వను. మహాబెదిరిస్తున్నావు. ఏంచేస్తావు?" తగ్గిపోవడం అవమానమనిపించి కోపంగా అన్నాడు.

"ఇవ్వకపోతే ఇదే మనకి మొదటిరాత్రి, ఆఖరి రాత్రి అవుతుంది. పెళ్లి అయింది. శోభనం కూడా అయిపోయింది. ఇంకేం చేస్తుందిలే మహా అయితే అరుస్తుంది అనుకున్నారు, అందుకే అంతవరకు చెప్పకుండా దాచారు. చూడండి. ఇది మీ కుటిలత్వాన్ని చాటుతుంది. పోనీ చెక్కుపుచ్చుకుని గప్‌చిప్‌గా ఊరుకోకుండా నాకు ఇప్పుడే చూపడంలో మీ ఉద్దేశ్యం పెద్ద కబుర్లు చెప్పావు. చూడు నేనేం సాధించానో అని చెప్పడమో, నీ ఆదర్శాలు నా దగ్గరకాదు. అని హేళన చెయ్యడానికో అయి వుంటుంది. దీన్ని బట్టి మీది ఎంత క్రుకెడ్ మెంటాలిటీవో అర్థం అయింది. ఆ చెక్కు కావాలో నేను కావాలో ఐదు నిముషాలలో తేల్చి చెప్పండి. ఇది బెదిరింపు కాదు. పెళ్లయిపోయింది కాబట్టి నోరు మూసుకు పడుంటాను అని మాత్రం అనుకుంటే పొరబాటు పడ్డట్టే! మొగుడు, సంసారం, వదులుకుంటాను గానీ ఇలాంటి కుచ్చితం మాత్రం సహించను" తీవ్రంగా అంది.

రామకృష్ణకి ఆమె సీరియస్‌గానే మాట్లాడుతుందన్నది అర్థం అయింది.

తగ్గిపోవడానికి అహం అడ్డువచ్చింది. ఆవేశంలో ఏదో అనబోయి అరక్షణం ఆలోచించి, తరువాత ఆ చెక్కును ముక్కలుగా చేసి సునీత మీదకి విసరివేసి అటుతిరిగి పడుకుండిపోయాడు. సునీత మొహం వికసించింది. అతనికోసం అర్థం అయి సునీత నవ్వుకుంది.

సునీతకి అర్థం అవనిది... రామకృష్ణ అరక్షణంలో కట్టిన లెక్కలు. అతను ఇంజనీరు, లెక్కల్లో దిట్ట. అతని బుర్ర కంప్యూటర్లా అరక్షణంలో నెలకు ఐదువేలు × పన్నెండు నెలలు × ముప్పై ఏళ్లు ఎంతో గుణించేసింది. వెధవ లక్షకోసం భవిష్యత్తులో వచ్చే ఇరవై లక్షలు వదులుకునే తెలివితక్కువవాడు అనుకుందేమో తనని, అలాగే అనుకుని సంతోషించనీ.. అనుకుని అతను అటు తిరిగి నవ్వుకున్నాడు. ఎవరికి వారు గెల్చిన తృప్తితో నిద్రపోయారు.

అయితే ఇద్దరూ ఆలోచించనిదీ, ఊహించనిది ఒకటుంది. మొదటి రాత్రి కాపురం ముచ్చటే ఇలా మొదలైతే తరువాత ఎలా ఉంటుంది. సంసారం ముచ్చట అన్నది ఇద్దరికి తట్టివుండదు బహుశా. మంచిదే! తట్టకపోవడంలో సుఖం ఉంది!!

◆ ఆంధ్రప్రభ వారపత్రిక, ఫిబ్రవరి-1998